ఈనాడు తమిళనాడు

మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ షమీద్ అహ్మద్ పదవీ ప్రమాణం

ప్యారిస్, న్యూస్‌టుడే: మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ షమీమ్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ షమీద్ అహ్మద్‌ను మద్రాసు హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం ఆయన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ ఆయనతో గురువారం పదవీ ప్రమాణం చేయించారు. ఆయనతో కలిపి ప్రస్తుతం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 67కి పెరిగింది. ఇంకా 8 మంది న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జస్టిస్ షమీమ్ అహ్మద్ అలహాబాద్‌లో 1966లో జన్మించారు. న్యాయవిద్యను పూర్తి చేసి 1933లో న్యాయవాద వృత్తి ప్రారంభించిన ఆయన 2019లో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ షమీద్ అహ్మద్‌కు తమిళనాడు ఏజీ పీఎస్ రామన్, తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ఛైర్మన్ పీఎస్ అమల్‌రాజ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



జస్టిస్ షమీద్ అహ్మద్‌తో ప్రమాణం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్

రెడ్ జోన్‌గా మెరీనా తీరం

ప్యారిస్, న్యూస్‌టుడే: భారత వైమానిక దళ ఎయిర్ షో మెరీనా తీరంలో జరగనున్న నేపథ్యంలో అక్టోబరు 1 నుంచి 6 వరకు ఆ ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో... అక్టోబరు 6న భారత వైమానిక దళం ఎయిర్ షో జరగనుందని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. అక్టోబరు 1 నుంచి 5 వరకు మెరీనా తీరంలో రిహార్సల్ జరుగుతాయని, భద్రతా కారణాల దృష్ట్యా తీర ప్రాంతాన్ని 6వ తేదీ వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. డ్రోన్ తదితర వాటిని ఎగురువేసేందుకు గ్రేటర్ చెన్నై పోలీసులు నిషేధం విధించినట్లు తెలిపారు.

ఏటీఎం చోరీ ముఠాపై పోలీసుల పద్మవ్యూహం

- 12 కి.మీ. వెంబడించి పట్టుకున్న వైనం
- తమిళనాడులో సంచలనం సృష్టించిన కేసు

3 రాష్ట్రాల్లో వరసగా 7 ఏటీఎంల లూటీ. రూ.68 లక్షలకు పైగా ధనాన్ని కొల్లగొట్టారు. ముందు కారు, తర్వాత కంటైనర్.. కళ్లుగప్పే వారి ఎత్తులేవీ తమిళనాడు పోలీసుల వ్యూహం ముందు ఫలించలేదు. పలు జిల్లాల మీదుగా బీభత్సం సృష్టిస్తూ వచ్చిన వారిని శుక్రవారం ఎలా పట్టుకున్నారనే విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమవుతోంది. పోలీసులు చెప్పే వివరాల్లోనూ చాలా ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

కంటైనర్‌ను వెంబడిస్తున్న పోలీసులు





లోపల కారు



మార్గమధ్యంలో వాహనాల్ని ఢీకొట్టిన ట్రక్కు

ఈనాడు–చెన్నై

వరసగా దోపిడీకి పాల్పడిన 7 ఏటీఎంల్లో చివరి 3 దొంగతనాలు కేరళ త్రిశూరులో చేశారు. శుక్రవారం తెల్లవారుజామున అర్ధరాత్రి 2.10 గంటలకు ఏటీఎం గది బయట, లోపల సీసీ కెమెరాలకు స్ప్రే కొట్టారు. లోపలికి ఎవరూ రాకుండా.. బయట ‘ఏటీఎం అండర్ రిపేర్ (ఏటీఎం రిపేరులో ఉంది)’ నోటీసులు అతికించారు. రెండే గంటల్లో ఏటీఎంల్లోని డబ్బునంతా బ్యాగుల్లో నింపుకొన్నారు. కొంతసేపటికే కేరళ పోలీసులు అప్రమత్తమయ్యారు.

పోలీసులపైనే దాడులు..

సేలం జిల్లా తోప్పుకాడు సమీపంలో నెమ్మదిగా పోలీసులు కంటైనర్‌లోకి ప్రవేశించారు. లోపల నెంబర్‌ప్లేట్‌లేని తెల్లకారుంది. ఆశ్చర్యం ఏమిటంటే.. ఓ ఏటీఎం యంత్రం కూడా అందులో ఉంది. ఇదే సమయంలో దొంగలు సైతం పోలీసులపై విరుచుకుపడ్డారు. ఇనుప రాడ్లతో దాడులకు దిగారు. ఎ.ధవమణి అనే ఇన్‌స్పెక్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ ముఠా డబ్బు బ్యాగులతో పారిపోయేందుకు ప్రయత్నించింది. పోలీసులు తుపాకులకు పని చెప్పారు. హెచ్.జుమానుద్దీన్(37) అక్కడికక్కడే చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. మరో దుండగుడు కె.అజర్‌అలీ(30)కి కాలులో తూటాలు దూసుకెళ్లాయి. ఇక్కడ దుండగులు, పోలీసుల మధ్య భీకరపోరు జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు వెంటనే వారిపైన పడి అదుపులోకి తీసుకున్నారు. ఆలీతో పాటు ఇక్రం(42), ముబారక్(18), షబ్బీర్‌ఖాన్(26), షౌకీన్(23), ఇర్ఫాన్(32) అరెస్టయ్యారు. వారంతా హరియాణాకు చెందినవారుగా గుర్తించారు. పలువురు పోలీసులూ గాయపడ్డారు. నిందితుల్ని సేలం జైల్లో ఉంచారు.



పోలీసుల అదుపులో దుండగుడు

24 వాహనాలతో ..

త్రిశూరు నుంచి తెల్ల కారులో దుండగులు వెళ్లినట్లు పలుచోట్ల సీసీ కెమెరాల్లో కనిపించింది. రెండురాష్ట్రాల పోలీసులు తమ కంట్రోల్‌రూమ్‌ల ద్వారా ఆ మార్గంలోని నిఘా నేత్రాలను పర్యవేక్షించారు. తమిళనాడు వెళ్లేదారిలో ఉన్నఫళంగా కారు మాయమవడం పోలీసులను విస్మయానికి గురిచేసింది. ఇక్కడ దొంగలు తెలివిని ప్రదర్శించారు. డబ్బు ఉన్న కారు పోలీసుల కళ్లకు చిక్కకుండా ఓ కంటైనర్‌ను ఎత్తుకెళ్లి అందులో పెట్టారు. కారు మాయమై, కొత్తగా ట్రక్కు రోడ్డులోకి రావడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. ఇందులో కారు ఉండొచ్చని పలు చెక్‌పోస్టుల్లో తనిఖీలకు ప్రయత్నించారు. దుండగులు పారిపోయేందుకు ప్రయత్నించడంతో అనుమానం పెరిగింది. ట్రక్కు నామక్కల్ జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత ఎక్కడా ఆపకుండా ఎదురొచ్చిన ప్రతిదాన్ని ఢీకొట్టి వెళ్తూ బీభత్సం సృష్టించింది. దాటి ధాటికి సేలం-ఈరోడ్డు హైవే మీద ఓ కారు దూరంగా విసిరేసినట్లు పడింది. ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఇలాగైతే కాదని పోలీసులు పెద్దఎత్తున వాహనాల్ని రంగంలోకి దించారు. సుమారు 24 కార్లు కంటైనర్ ట్రక్కును చుట్టుముట్టి వెంబడించాయి. కొన్నిచోట్ల ట్రక్కును ఢీకొట్టి ఆపేందుకు యత్నించారు. ట్రక్కులోని దుండగులు మార్గమధ్యంలో హైవే మీదున్న ఇనుప బారికేడ్లను ధ్వంసం చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. 12 కి.మీ. వెంబడించి ఎట్టకేలకు పోలీసులు అతికష్టంమీద కంటైనర్‌ను కట్టడిచేశారు. 5 మంది దుండగులు కారులో దాక్కున్నట్లు గుర్తించారు. బయట పోలీసులంతా తుపాకులు గురిపెట్టారు. అంతా నిశ్శబ్దం. అటు పోలీసులు, ఇటు దొంగల్లో ఆందోళన. దుండగుల వద్ద ఆయుధాలున్నట్లు గుర్తించారు. ఈ దృశ్యాలన్నింటినీ చుట్టుపక్కల ఊరివాళ్లు చూస్తూనే ఉన్నారు.

గూగుల్ మ్యాప్ సాయంతో..



6 మాసాల్లో దక్షిణాది రాష్ట్రాల్లో 15 ఏటీఎంలను వరుసగా లూటీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. సెప్టెంబరు 1న కృష్ణగిరిలో ఏటీఎం దోపిడీ జరిగింది. రూ.9 లక్షలు అపహరణకు గురయ్యాయి. ఇక్కడా హరియాణాకు చెందిన ఇద్దరు అరెస్టయ్యారు. ఏటీఎంను రెక్కీచేసి మరీ ఎంచుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. సెక్యూరిటీ గార్డుల్లేని ఏటీఎంలను గూగుల్‌మ్యాప్ ద్వారా ట్యాగ్ చేయడం, వాటిని తమ ముఠాకు పంపి దోపిడీకి ప్రణాళిక రచిస్తున్నారు.

చెన్నై నుంచే..

ఈ గ్యాంగ్ ఏటీఎం దోపిడీల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారని దర్యాప్తులో బయటపడింది. వారంతా తొలుత చెన్నై చేరుకుని ఇక్కడే బస చేసి ఎక్కడ దోపిడీ చేయాలనే ప్రణాళిక కూడా నగరంలోనే రచించారని పోలీసులు తెలిపారు. త్రిశూరులో దోపిడీకి ముందు నగరంలోనే కలిశారని పేర్కొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాడనే ఉప ముఖ్యమంత్రి పదవి: సీఎం స్టాలిన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ప్రజలకు అండగా నిలవడానికే ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి అప్పగించినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఆయన సోమవారం తన ‘ఎక్స్’ పేజీలో.. రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సెంథిల్‌బాలాజీ, కోవి చెళియన్, ఆర్.రాజేంద్రన్, ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన ఉదయనిధికి అభినందనలు తెలియజేశారు. యువజన సంక్షేమం, క్రీడావృద్ధిశాఖగా రాణిస్తున్న ఉదయనిధికి తన కుమారుడని ఉప ముఖ్యమంత్రి పదవి అప్పగించలేదని, రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటాడనే ఉద్దేశంతో ఆ పదవిలో కూర్చోబెట్టినట్లు వివరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా అందరూ నడచుకోవాలని హితవుపలికారు.

శివాజీ గణేశన్‌కు నివాళి నేడు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: నడిగర్ తిలగం శివాజీ గణేశన్ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ఉదయం 10 గంటలకు చెన్నై అడయార్ దేశ్‌ముఖ్ రోడ్డులోని శివాజీ గణేశన్ మణిమండపంలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళి అర్పించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, గ్రేటర్ చెన్నై మేయర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు పాల్గొంటారు.

కొందరిపైనే సూర్యుడి వెలుగు: అన్నామలై

సైదాపేట, న్యూస్‌టుడే: ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి అప్పగించడంపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విమర్శలు గుప్పించారు. ఇందుకు సంబంధించి సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో కొందరిపైనే సూర్యుడి వెలుగు పడుతోందని, గత 40 నెలలుగా రాష్ట్రంలో మిగిలినవారికి గ్రహణం పట్టుకుందని ఎద్దేవా చేశారు. డీఎంకే చెప్పుకునే ‘విడియల్’ (ఉదయం) అనే పదానికి అర్థం ఏంటనేది ప్రస్తుతం ప్రజలకు అర్థమైందని తెలిపారు. విడియల్ స్టాలిన్ కుటుంబానికేనని ధ్వజమెత్తారు.

నన్ను కలిసేందుకు రావద్దు: ఉదయనిధి

సైదాపేట, న్యూస్‌టుడే: తనను కలిసేందుకు ఎవరూ చెన్నై రావద్దని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలను కోరారు. ఇందుకు సంబంధించి ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత డీఎంకే నిర్వాహకులు, కార్యకర్తలు ప్రత్యక్షంగా కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి చెన్నై వస్తున్నారని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సూచన మేరకు ఆయా ప్రాంతాల్లో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు. తను కలిసేందుకు చెన్నై రావటాన్ని మానుకోవాలని ప్రేమతో విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. జిల్లాల పర్యటనలో కలిసి శుభాకాంక్షలు అందుకుంటానని చెప్పారు.

వర్షాలు, వరదల సమాచారానికి టీఎన్ అలర్ట్ యాప్: సీఎం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు సకాలంలో వాతావరణ హెచ్చరికలతో భారీ నష్టాన్ని నివారించడానికి, ముందస్తు హెచ్చరిక సమాచారం తెలియజేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని సీఎం స్టాలిన్ తెలిపారు. అందులో భాగంగా ‘టీఎన్ అలర్ట్’ యాప్ రూపొందించినట్లు చెప్పారు. ఈశాన్య రుతుపవనాల సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సోమవారం సీఎం నేతృత్వంలో సచివాలయంలో సమీక్షా నిర్వహించారు.

స్టాలిన్ మాట్లాడుతూ గంటలకొద్దీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీరు, రవాణా, విద్యుత్తు సరఫరాకు భారీ నష్టం వాటిల్లుతోందన్నారు. గత ఏడాది ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో చెన్నై, తిరునెల్వేలి, తూత్తుక్కుడి జిల్లాల్లో ఎన్నడూ లేని విధంగా వర్షాలు కురిశాయి. ప్రభుత్వం సమర్థవంతంగా పని చేయడంతో వరద ప్రభావిత జిల్లాలు సాధారణ స్థితికి చేరుకున్నాయని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందని తెలిపారు. ఈశాన్య రుతుపవనాలకు సంబంధించి గతనెల 14, 21 తేదీల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, కార్పొరేషన్ కమిషనర్లతో సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారని చెప్పారు. ప్రజలకు సకాలంలో వాతావరణ హెచ్చరికలతో భారీ నష్టాలను నివారించవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా ‘టీఎన్ అలర్ట్’ యాప్ తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా నష్టపోయేది మత్స్యకారులేనన్నారు. వారిని అధునిక టెలికమ్యూనికేషన్ పరికరాల ద్వారా తుపాన్లు, భారీ వర్షాలపై సకాలంలో సమచారం ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో స్టాలిన్, మంత్రులు

ఈ ఏడాది జులై వరకు

రోడ్డు ప్రమాదాల్లో 10,536 మంది మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈ ఏడాది జులై వరకు రోడ్డు ప్రమాదాల్లో 10,536 మంది మృతి చెందినట్లు డీజీపీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. అందులో.. ఇదే కాలానికి గతేడాదితో పోల్చితే ఈసారి మృతుల సంఖ్య 5 శాతం తగ్గిందన్నారు. ఈ సంవత్సరం జులై వరకు రాష్ట్ర వ్యాప్తంగా 10,066 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాటిల్లో 10,536 మరణాలు సంభవించాయి. గతేడాది జులై వరకు 10,589 దుర్ఘటనలు చోటుచేసుకోగా 11,106 మంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది కన్నా 523 ప్రమాదాలు, 570 మరణాలు తగ్గాయి. ఈ ఏడాది జులై వరకు అతివేగంగా వాహనం నడిపినందుకు 1,05,097 కేసులు నమోదయ్యాయి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపినందుకు 2.31 లక్షల కేసులు, మద్యం తాగి వాహనాలు నడిపినందుకు 1,13,777 కేసులు నమోదయ్యాయి. సామర్థ్యానికి మించి వస్తువులు తీసుకెళ్లినందుకు 6,944, సరకు వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళ్లినందుకు 74,013 కేసులు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపినందుకు.. 35.78 లక్షల కేసులు, కారులో సీటు బెల్టు లేకుండా వెళ్లినందుకు 3.39 లక్షల కేసులు నమోదయ్యాయి. మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించినందుకు 76.15 లక్షల కేసులు నమోదయ్యాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపినందుకు 1.82 లక్షల మంది డ్రైవింగ్ లైసెన్సు తాత్కాలికంగా రద్దు చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సిఫారసు చేసినట్లు, ఆ మేరకు 39,924 మంది లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలను నివారించడానికి పలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



ఆన్‌లైన్ వ్యాపారంపై ప్రధానిని కలుస్తాం: విక్రమరాజా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ వ్యాపారంపై ప్రధాని మోదీని కలిసి మాట్లాడనున్నట్లు వాణిజ్య సంఘ సమాఖ్య అధ్యక్షుడు విక్రమరాజా తెలిపారు. సోమవారం ఆయన పుదుకోట్టైలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ ఛార్జీల పెంపు, ఆస్తిపన్ను, వ్యాపార పన్ను, ఆన్‌లైన్ వ్యాపారంతో వ్యాపారులు పూర్తిగా నష్టపోతున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేసేందుకు తమిళనాడు వాణిజ్య సంఘ సమాఖ్య చర్చలు జరుపుతోందన్నారు. రాష్ట్రంలో సిబ్బంది కొరత ఉన్నందున ఉత్తరాది కార్మికులను నమ్మి వ్యాపారాలు కొనసాగిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ వ్యాపారం కొనసాగితే 10కోట్ల మంది వ్యాపారులు కనుమరుగవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

మైక్రో ఏటీఎంలుగా రేషన్ దుకాణాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలను మైక్రో ఏటీఎంలుగా మార్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తద్వారా ప్రజలకు బ్యాంకు సేవలు సులభంగా అందుతాయని భావిస్తోంది. పలు గ్రామాలు, కొండ గ్రామాల్లో నగదు తీసుకునేందుకు ఏటీఎంలు అందుబాటులో లేవు. బ్యాంకు సేవలు పొందేందుకు అక్కడివారు ఇబ్బంది పడుతున్నారు. 2014 నుంచి సంక్రాంతి కానుక నగదును చౌక దుకాణాల్లో అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటీఎం కేంద్రాలు అందుబాటులో లేని గ్రామాల్లోని రేషన్ దుకాణాలను డిజిటల్ పద్ధతిలో నగదు బట్వాడా చేసే మైక్రో ఏటీఎంలుగా మార్చనున్నారు. సహకార సంఘాల రిజిస్ట్రార్ సుబ్బయ్య మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని 4,500 యూనిట్‌లలో 3,500 యూనిట్‌లను మైక్రో ఏటీఎంలుగా మార్చినట్లు గుర్తు చేశారు. రేషన్ దుకాణాలు మైక్రో ఏటీఎంలుగా మారినప్పుడు ఆధార్ నెంబరు ఆధారంగా రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు లావాదేవీలు కొనసాగించవచ్చని తెలిపారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 34 లక్షల మంది రూ.1,000 వృద్ధాప్య భృతి పొందుతున్నారని, వారిలో 2.7 లక్షల మంది బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా అందుకుంటున్నారని చెప్పారు. ఏటీఎంలను వినియోగించుకోవడం లేదన్నారు. కొత్త విదానంతో గ్రామీణ ప్రజలు కూడా రేషన్ దుకాణాల నుంచి నగదు సేవలు సులభంగా పొందొచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి మెము రైళ్లకు 12 బోగీలు

వడపళని, న్యూస్‌టుడే: ప్రస్తుతం ఎనిమిది బోగీలతో నడుస్తున్న మెము రైళ్లు అక్టోబరు 1 నుంచి 31 వరకు 12 బోగీలతో నడుస్తాయని దక్షిణ రైల్వే సోమవారం ప్రకటనలో తెలిపింది.

● **06721** చెన్నై బీచ్-మేల్‌మరువత్తూరు, **06722** మేల్‌మరువత్తూరు-చెన్నై బీచ్, **06033** చెన్నై బీచ్- తిరువణ్ణామలై, **06034** తిరువణ్ణామలై-చెన్నై బీచ్, **16087** అరక్కోణం-సేలం, **16088** సేలం-అరక్కోణం రైళ్లు 12 బోగీలతో నడుస్తాయి.

ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆందోళన 7న

వేళచ్చేరి, న్యూస్‌టుడే: పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధంలో ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్న అమెరికా, ఇతర సామ్రాజ్య దేశాల తీరును ఖండిస్తూ, ఇజ్రాయెల్ జరుపుతున్న మారణ హోమాన్ని తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ 7న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టనున్నట్లు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సంయుక్తంగా ప్రకటించాయి. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో.. యుద్ధంలో భారీగా ప్రాణనష్టం జరిగిందన్నారు. వేలాది మంది గాయపడ్డారన్నారు.

ముఖ్యమంత్రి స్టాలిన్ మేలుకోవాలి : ఎడప్పాడి

సేలం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ నిద్ర నుంచి మేలుకుని ఈశాన్య రుతువవనాల ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పేర్కొన్నారు. ఆయన సేలం విమానాశ్రయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈశాన్య రుతుపవనాలు మరికొద్ది రోజుల్లో రాష్ట్రంలో ప్రవేశించే అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టలేదన్నారు. ఇలానే ఉంటే చెన్నై వరదలో మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొలనులు, చెరువుల్లో పూడికతీసి వర్షపు నీటిని నిల్వజేయాలని సూచించారు. ప్రజా శ్రేయస్సును పక్కన పెట్టిన స్టాలిన్ తన తనయుడిని ఉప ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడానికే అధిక సమయం కేటాయించడం దారుణమన్నారు. వారసులకు పదవులు కట్టబెట్టడం ద్రావిడ మోడల్ పాలనని ఎద్దేవా చేశారు. రానున్న శాసనసభ ఎన్నికలతో వారసత్వ రాజకీయాలకు రాష్ట్ర ప్రజలు స్వస్తి పలకడం ఖాయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీరుసెల్వంను మళ్లీ పార్టీలో చేర్చుకునే అవకాశంలేదన్నారు.



మాట్లాడుతున్న పళనిసామి

యువకుడి మృతికి నిర్వహణ లోపమే కారణం

సైదాపేట, న్యూస్‌టుడే: వాననీటి కాలువలో పడి యువకుడు మృతి చెందడానికి కార్పొరేషన్ నిర్వహణ లోపమే కారణమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిసామి ఆరోపించారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై అశోక్‌నగర్‌లో వాననీటి కాలువ వద్ద తగిన రక్షణ ఏర్పాట్లు చేయలేదని, దీంతో అయ్యప్పన్ అనే వ్యక్తి అందులో పడి మృతి చెందాడని తెలిపారు. ఆయన మృతికి కార్పొరేషన్ యంత్రాంగ నిర్వహణ లోపమే కారణమని ఆరోపించారు. తేలికపాటి వర్షానికే చెన్నైలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని విమర్శించారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి స్టాలిన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపు

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురైలో ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చిన ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల వివరాల మేరకు.. మదురై నరిమేడులోని కేంద్రీయ విద్యాలయ హయ్యర్ సెకండరీ పాఠశాల నిర్వాహకుడి సెల్‌ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ వచ్చింది. అందులో పాఠశాలలో బాంబు పేలుతుందని ఉంది. పొన్మేని ప్రాంతంలోని జీవన హయ్యర్ సెకండరీ పాఠశాల, చింతామణి ప్రాంతంలోని వేలమ్మాల్ బోధి క్యాంపస్ పాఠశాలలకు కూడా బాంబు పెట్టినట్లు ఈ-మెయిల్ వచ్చింది. సమాచారం అందిన పోలీసులు వెంటనే పాఠశాలలకు చేరుకుని బాంబు స్క్వాడ్, పోలీసు జాగిలాలతో తనిఖీ చేశారు. వాటిలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యమవలేదు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మొత్తం 9 ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం స్థానికంగా కలకలం సృష్టించింది. సమాచారం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల నుంచి తీసుకెళ్లిపోయారు.



ఓ పాఠశాల ప్రాంగణంలో బాంబు స్క్వాడ్ తనిఖీ

నిబంధనలకు అనుగుణంగా పార్టీ జెండాలు: ఎన్నికల సంఘం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాజకీయ పార్టీల జెండాలపై చిహ్నాలు, ఫొటోలకు సంబంధించి ఎన్నికల సంఘం అమోదం లేదా గుర్తింపు ఇవ్వదని కేంద్ర ఎన్నికల సంఘం బీఎస్పీకి స్పష్టం చేస్తూ లేఖ రాసింది. నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం జెండా పైభాగం, కింది భాగంలో ఎరుపు రంగు, మధ్యలో పసుపు రంగు ఉంది. మధ్యలో పువ్వు, దానికి ఇరువైపులా రెండు యుద్ధ ఏనుగులు పైకి లేచిన కాళ్లతో 28 నక్షత్రాలు ఉన్నాయి. ఏనుగు తమ పార్టీ చిహ్నమని, ఆ జెండాను అనుమతించకూడదని బీఎస్పీ తరఫున కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రాజకీయ పార్టీల జెండాలపై కనిపించే చిహ్నాలు, చిత్రాలకు సంబంధించి ఎన్నికల సంఘం జోక్యం చేసుకోదని, ఆయా పార్టీలు నిబంధనలకు అణుగుణంగా ఉండేలా చూసుకోవాలని సమాధానమిచ్చింది. తమిళగ వెట్రికళగం జెండాపై ఏనుగు గుర్తు విషయంలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకోదని తెలిపింది. ఎన్నికల సమయంలో ఏనుగు గుర్తును ఆ పార్టీ గుర్తుగా ఉపయోగించుకోదని పేర్కొంది.



తమిళగ వెట్రి కళగం పతాకంతో నటుడు విజయ్

మౌంటైన్ రైలు సేవలు రద్దు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మేట్టుపాలయం-కున్నూర్ మధ్య కల్లార్ నుంచి హిల్‌గ్రోవ్ వరకు మూడు ప్రాంతాల్లో కొండచరియలు జారిపడటంతో చెట్లు విరిగిపడ్డాయి. మౌంటైన్ రైలు ట్రాక్ దెబ్బతింది. ఈ నేపథ్యంలో మేట్టుపాలయం నుంచి సోమవారం ఉదయం కున్నూర్‌కు బయలుదేరిన రైలును కల్లార్ రైల్వేస్టేషన్‌లో ఆపారు. తిరిగి మేట్టుపాలయం చేరుకోగా రైలు సేవలు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో రైల్వే సిబ్బంది నిమగ్నమయ్యారు



పట్టాలపై జారిపడిన బండరాయి, విరిగి పడిన చెట్లు

నాలుగుకు చేరిన ఆదిద్రావిడ మంత్రుల సంఖ్య

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రివర్గంలో ఆదిద్రావిడ వర్గానికి చెందినవారి సంఖ్య నాలుగుకు చేరింది. మంత్రివర్గంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి స్టాలిన్ సహా 34 మంది మంత్రులు ఉన్నారు. గతంలో 33 మంది ఉండగా ముగ్గురిని తొలగించి ఇద్దరు మాజీలు, ఇద్దరు కొత్తవారిని తాజాగా తీసుకున్నారు. సెంథిల్ బాలాజీకి పాత శాఖలే ఇచ్చారు. కొత్తగా తీసుకున్న కోవి చెళియన్‌కు ఉన్నత విద్య, రాజేంద్రన్‌కు పర్యాటక శాఖలు కేటాయించారు. వారిద్దరూ ఆదిద్రావిడ వర్గానికి చెందిన వారు. ఇప్పటికే మంత్రులుగా ఉన్న కయల్విలి జి.సెల్వరాజ్, సి.వి.గణేశన్ ఆదిద్రావిడ, మదివేందన్ అరుంధతి వర్గాలకు చెందినవారు. ● కొద్దిరోజులుగా డీఎంకేలో అసంతృప్తిగా ఉన్న వీసీకేకు ఈ మంత్రివర్గం కూర్పు కాస్త ఊరట నిచ్చేలా ఉంది. అధికారంలో భాగస్వామ్యం నినాదాన్ని ఆ పార్టీ కొద్దిరోజులపాటు లేవనెత్తదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వీసీకే శాసనసభా పక్ష నాయకుడు, ఎమ్మెల్యే చింతనై సెల్వన్ తన ఎక్స్ పేజీలో.. సామాజిక న్యాయ ప్రయాణంలో ఇదో మైలురాయి అన్నారు. ఇదివరకెన్నడూ ఇంతమంది ఆదిద్రావిడ వర్గీయులు మంత్రివర్గంలో లేరన్నారు.

పురాతన మట్టికూజాలు లభ్యం


మట్టికూజా అందిస్తున్న విద్యాకరన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లా మారండఅల్లి రాశికుట్టై గ్రామం సమీపంలోని కొండ శివారున కొందరు చిన్నారులు ఆడుకొంటున్న సమయంలో కుండ పెంకు కనిపించింది. మారండఅల్లి ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో 11వ తరగతి చదువుకుంటున్న విద్యార్థి విద్యాకరన్ దాన్ని తొలగించాలని యత్నించగా మట్టి కూజాలో ఒక భాగంగా గుర్తించాడు. ఒక భాగం కొంచెం పగిలింది. అదే ప్రాంతంతో పగిలిన మరో రెండు కూజాలు లభ్యమయ్యాయి. విద్యాకరన్ వాటిని చరిత్ర ఉపాధ్యాయుడు వీరమణికి చూపాడు. వీరమణి తగటూర్ అదియమాన్ హిస్టారికల్ సొసైటీ ఛైర్మన్, ఆర్కియాలజీ డిపార్టుమెంట్ రిటైర్డ్ అసోసియేట్ డైరెక్టర్ సుబ్రమణియంకు తెలియజేశారు. సుబ్రమణియన్, సంఘ కార్యదర్శి డాక్టర్ సెందిల్, రాజన్ తదితరులు రాశికుట్టైకు నేరుగా వెళ్లి మట్టి కూజాలను పరిశీలించారు. అవి 3,500 ఏళ్ల నాటివని మట్టితో తయారు చేశారన్నారు.

వళ్లువర్ కొట్టం
పైవంతెన నిర్మాణం వాయిదా
మెట్రో పనులతో ఆటంకం

చెన్నై నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రభుత్వం వళ్లువర్ కొట్టం కూడలి వద్ద పైవంతెన నిర్మాణానికి గతంలోనే శ్రీకారం చుట్టింది. దీనిపై తర్జనభర్జనలు, కొందరి నుంచి వ్యతిరేకతలు ఎదురయ్యాయి. అనంతరం 2022లో అసెంబ్లీ సమావేశాల్లో పైవంతెన నిర్మాణానికి ప్రభుత్వం తీర్మానించింది. అయితే ప్రస్తుతం మెట్రో రెండో దశ పనుల్లో భాగంగా నుంగంబాక్కం హైరోడ్డు నుంచి జెమినీ కూడలి వరకు భూగర్భ పనుల కారణంగా వళ్లువర్ కొట్టం నుంచి వన్‌వేగా చేశారు. దీంతో వళ్లువర్ కొట్టం నుంచి కోడంబాక్కం హైరోడ్డు, పామ్‌గ్రోవ్ హోటల్ మీదుగా వచ్చే వాహనాలు వళ్లువర్ కొట్టం హైరోడ్డు, నుంగంబాక్కం హైరోడ్డు చుట్టూ తిరిగి వస్తున్నాయి. ఈ క్రమంలో పైవంతెన పనులు కూడా ప్రారంభమయితే అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో 2027 వరకు పనులకు ఆటంకం కలిగే అవకాశాలున్నాయి. **- న్యూస్‌టుడే, వడపళని**


వళ్లువర్ కొట్టం కూడలి

స్థల సమస్య

2022 అసెంబ్లీ సమావేశాల్లో కోడంబాక్కం హైరోడ్డు నుంచి కోడంబాక్కం పైవంతెనకు ముందు వరకు 570 మీటర్ల పొడవు, నాలుగు వరుసలతో కూడిన వంతెన నిర్మాణానికి అధికారులు సన్నద్ధమయ్యారు. నిర్మాణానికి 10వేల చ.మీ స్థలం అవసరముండగా 2 వేల చ.మీ స్థల సేకరణ పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రస్తుతం గంటకు వళ్లువర్ కొట్టం కూడలి వద్ద పదివేల వాహనాల వరకు తిరుగుతున్నాయి. అన్నాసాలై, నుంగంబాక్కం, స్టెర్లింగు రోడ్డు మెట్రో స్టేషన్ల నిర్మాణ పనులు జరుగుతున్నందున వాహనాలు దారి మళ్లించారు. వాహనాల దారి మళ్లింపు, మెట్రో పనులతో ఈ ప్రాంతం బాగా రద్దీగా ఉండటంతో ప్రస్తుతం ప్రాజెక్టుతో ముందుకు సాగలేమని కార్పొరేషన్ కమిషనరు జె.కుమారగురుబరన్ అన్నారు. స్థలం కోసం చర్చలు జరగాల్సి ఉందని, త్వరలోనే ఆ పనులు ముగిస్తామన్నారు. పైవంతెన నిర్మాణ పనులు 2027లో ప్రారంభం కాగలవని ఆయన చెప్పారు.

మరుగునపడిన పాత నమూనా..

- రూ.200 కోట్లతో నిర్మాణం చేపట్టదలచుకున్న పైవంతెన కోడంబాక్కం హైరోడ్డులోని పామ్‌గ్రోవ్ హోటల్ నుంచి కోడంబాక్కం పైవంతెన వద్దనున్న మట్టి కుండలు తయారు చేసే ప్రదేశం వరకు రానుంది. మార్గంలో కోడంబాక్కం హైరోడ్డులో ఉన్న ఆలయం తొలగించాల్సి ఉండటంతో అధికారులకు సవాలుగా మారింది. 2014లో పైవంతెన నిర్మాణం కోసం వళ్లువర్ కొట్టం వద్దనున్న తిరుమలైపిళ్లై రోడ్డు, పూనమల్లి హైరోడ్డులోని ఈగా థియేటర్ వరకు అనుసంధానం చేసే విధంగా డిజైన్ చేశారు. దీనికి వ్యయ అంచనా రూ.వెయ్యి కోట్ల వరకు చేరుకోవడంతో ఆ ఆలోచన మరుగున పడిందని కార్పొరేషన్ వంతెనల విభాగ అధికారులు పేర్కొన్నారు. ఆ తర్వాత 2022లో చేసిన కొత్త డిజైన్‌కు ఆమోదం లభించింది.
- మొదట్లో అనుకున్నట్టుగా పైవంతెన నిర్మాణం జరిగినా వళ్లువర్ కొట్టం కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గినా నుంగంబాక్కం హైరోడ్డు (ఉత్తమర్ గాంధీ సాలై) కూడలి, జెమినీ పార్క్ హోటల్ వద్ద వాహనాల రద్దీలో మార్పేమీ ఉండదని, ప్రస్తుతం ప్రాజెక్టు ఆగినందువల్ల వళ్లువర్ కొట్టం పైవంతెనను జెమినీ పైవంతెన లేదా కేథడ్రల్ రోడ్డు గుండా వచ్చే విధంగానైనా మార్పు చేసేందుకు ఆలోచించవచ్చని ఓ అధికారి పేర్కొన్నారు. దీనిపై హైవేస్ విభాగంతో కూడా చర్చలు జరపాలని తెలిపారు.

కావేరి సమస్యను రాజకీయం చేయొద్దు: కేంద్రమంత్రి కుమారస్వామి


కుమారస్వామికి స్వాగతం పలుకుతున్న వేదపండితులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరి నదీ జలాల సమస్యను ఎవరూ రాజకీయం చేయొద్దని కేంద్రమంత్రి కుమారస్వామి తెలిపారు. బెంగళూర్ నుంచి సోమవారం ప్రత్యేక విమానంలో తిరుచ్చికి చేరుకున్న ఆయన శ్రీరంగం రంగనాథర్ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇక్కడి నుంచి నేరుగా సేలం వెళ్లి స్టీల్ ప్లాంట్‌ని పరిశీలించనున్నట్లు తెలిపారు. 1970లో ప్రారంభమైన స్టీల్‌ప్లాంట్ మొదట్లో బాగా లాభాలను ఆర్జించిందన్నారు. కొన్నేళ్లుగా బలహీనపడిందన్నారు. మళ్లీ గత వైభవం తీసుకొచ్చేందుకు అధికారులతో చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. సరైన సమయంలో కావేరి పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. వర్షపాతం తక్కువగా ఉన్నప్పుడే నీటి పంపిణీ సమస్య తలెత్తుతోందన్నారు. దీనిని తమిళనాడు రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ఇరు రాష్ట్రాలు దీన్ని అర్థం చేసుకొని మెలగాలన్నారు. కావేరి సమస్యను ఎవరూ రాజకీయం చేయొద్దని కోరారు.

ఐఐటీఎంలో కొత్త కోర్సు ప్రారంభం



కోర్సు కరపత్రం

వడపళని, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులకు నైపుణ్య ఆధారిత శిక్షణ కార్యక్రమం (ఎస్‌బీటీపీ)ని బోధించేందుకు 'స్వయం ప్లస్'తో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం) ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 11 రోజులపాటు జరిగే శిక్షణ అక్టోబరు 7 నుంచి 18వ తేదీ వరకు ఉంటుందని సోమవారం ఐఐటీ ఓ ప్రకటన విడుదల చేసింది. అక్టోబరు 3వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, https:/// iitmpravartak.org.in/ advanced electronic_mfg లింకు ద్వారా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించింది. బీఈ, బీటెక్, ఏదేని డిప్లొమా, ఎలక్ట్రానిక్స్‌తో బీఎస్సీ పూర్తి చేసిన లేదా తుది సంవత్సరం చదువుతున్న వారు అర్హులు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బోధన ఉంటుంది. కోర్సు ఫీజు జీఎస్టీ కాకుండా రూ.15 వేలు. ప్రాంగణంలో బస చేసేందుకు రోజుకు రూ. 650 చెల్లించాలి. ఐటీఎం, ఐఐటీఎం ప్రవర్తక్‌తో కలిసి స్వయం ప్లస్ సర్టిఫికెట్‌ను అందిస్తుంది.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కేసరి విద్యార్థి ఎంపిక


విద్యార్థి రాజేష్‌కు క్రీడా ఉపకరణాలు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఇటీవల విళుపురం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్రంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. చెన్నై జిల్లా నుంచి టీనగర్ కేసరి మహోన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రాజేష్ అండర్ 17 విభాగంలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచాడు. దీంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్ నెలలో మహారాష్ట్రలో జాతీయస్థాయి పోటీలు జరుగుతాయని సెలక్షన్ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య సోమవారం విద్యార్థి రాజేష్‌ను అభినందించారు.

500 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం

వడపళని, న్యూస్‌టుడే: అక్టోబరులో విద్యుత్తు డిమాండు తట్టుకునేందుకు అదనంగా 500 మెగావాట్ల విద్యుత్తు కోసం యూనిట్ రూ.9కి కొనుగోలు చేసేందుకు టాన్‌జెడ్కో ఒప్పందం కుదుర్చుకుంది. అక్టోబరులో కూడా ఎండలు ఎక్కువగా ఉంటాయని, కావున సాయంత్రం 6 నుంచి తెల్లవారు జామున 2 గంటల వరకు విద్యుత్తు వినియోగం అధికంగా ఉంటుందని టాన్‌జెడ్కో పేర్కొంది. ఇతర రాష్ట్రాలకు కూడా డిమాండు ఉండొచ్చని, కావున ముందుగానే ఎక్కువ ధరకు కాకుండా కొనుగోలు చేసుకునేందుకు గత నెలలో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వివరించింది. అక్టోబరు 15వ తేదీ తర్వాత పవన విద్యుదుత్పత్తి కూడా తగ్గుతుందని, అది కూడా ఓ కారణం కావడంతో కొనుగోలు చేస్తున్నట్టు చెప్పింది. అక్టోబరు 15 నుంచి 15 రోజులపాటు కొనుగోలు చేసేందుకు ఒప్పంద సంతకాలు జరిగాయని, ఈశాన్య రుతుపవనాలు ఆలస్యమైతే కొనుగోలు పొడిగించే వీలుందని పేర్కొంది. ప్రస్తుతం పవన ఉత్పత్తి 11 మెగా యూనిట్లు మాత్రమే ఉందని తెలిపింది.

పాఠశాలలో మంత్రి తనిఖీ

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో 1929లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ భవనాన్ని కూల్చి కొత్తగా నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇందుకు సంబంధించి తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్‌ని కొన్నిరోజుల క్రితం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మంత్రి ఆకస్మికంగా పాఠశాలకు విచ్చేసి పాత భవనాలను పరిశీలించారు. కనీస వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్బిల్ మహేశ్

సెంథిల్ బాలాజీ ఏవిధంగా త్యాగి?: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: జైలుకు వెళ్లి వచ్చిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ త్యాగి అయితే ఆయన చేతిలో మోసపోయినవారు ఏమవుతారని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అక్రమ కేసులో 15 నెలలు జైలు శిక్ష అనుభవించడమే సెంథిల్ బాలాజీ చేసిన త్యాగమని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం తెలిపారన్నారు. వేల మంది యువకుల భవిష్యత్తును నాశనం చేసిన వ్యక్తిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంతలా దిగజారి కొనియాడటం ఆమోదయోగ్యం కాదన్నారు. ఆయన నిర్దోషిగా జైలు నుంచి బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి సెంథిల్ బాలాజీని పొగడటం చూస్తుంటే ఈ కేసు విచారణ తమిళనాడులో న్యాయంగా జరుగుతుందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. కావున కేసు విచారణను వేరే రాష్ట్ర న్యాయస్థానానికి మార్చాలని సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వేలచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై మహానగర కార్పొరేషన్ రాయపురం జోన్‌లోని బేరక్స్ రోడ్డులో హార్బర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రూ.6.06 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, వాననీటి కాలువలు, అధునాతన బస్‌షెల్టర్లు, పలు భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాల్గొన్న మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియారాజన్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఉత్తర ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ కట్టా రవితేజ, జోన్ ఛైర్మన్ శ్రీరాములు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ

'ఎస్‌కేపీసీ'లో పురస్కార ప్రదానోత్సవం

వడపళని, న్యూస్‌టుడే: శ్రీ కన్యకాపరమేశ్వరి మహిళా ఆర్ట్స్, సైన్సు కళాశాల (ఎస్‌కేపీసీ)లో సోమవారం 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ' పురస్కార ప్రదానోత్సవం జరిగింది. తమిళనాడు మినరల్స్ లిమిటెడ్ ప్రిన్సిపల్ కార్యదర్శి అనిల్ మేష్‌రామ్, చెన్నై కస్టమ్స్ కమిషనరు రాజేష్ సింగ్ దహియా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పురస్కారాలందుకున్నారు. కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, డీన్ డాక్టర్ పీబీ వనిత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబీ నప్పిన్నై, ప్రిన్సిపల్ మోహనశ్రీ తదితరులు హాజరయ్యారు.

వీఐటీలో ముగిసిన 'గ్రావిటాస్'


విజేతలకు ధ్రువపత్రాలు అందిస్తున్న విశ్వనాథన్

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ వీఐటీ విశ్వవిద్యాలయంలో 'గ్రావిటాస్' పేరిట సాంకేతిక మేధాశక్తికి సంబంధించిన పోటీలు శనివారం ప్రారంభమై సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన 200 రకాల పోటీల్లో 35 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ మేధాశక్తితో మలిచిన ఆవిష్కరణలను ప్రదర్శనలో ఉంచారు. విజేతలకు కులపతి విశ్వనాథన్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఉపకులపతి పార్థసారథి మల్లిక్, రిజిస్ట్రార్ జయభారతి పాల్గొన్నారు.

కుమారుడి ప్రాణాలు రక్షించండి

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ కలెక్టర్ కార్యాలయంలో సమస్యల పరిష్కార శిబిరం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వేలూర్ అలమేలుమంగాపురానికి చెందిన రౌడీషీటర్ తల్లి కలైసెల్వి తన కోడలు, మనవడితో వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అందులో... తన కుమారుడు రాజా 18 నెలలుగా వేలూర్ జైల్లో ఉంటున్నాడని, పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆరోపించింది. విచారణకు కోర్టులో హాజరుపరిచే సమయంలో తమతో మాట్లాడేందుకు పోలీసులు అనుమతించట్లేదని పేర్కొంది. తన కుమారుడిని ఎన్‌కౌంటర్ చేసేందుకు పోలీసులు ప్రణాళిక రచించినట్లు తెలిసిందని, దానిని అడ్డుకోవాలని కోరింది.


వినతిపత్రం చూపుతున్న కలైసెల్వి

వారసత్వ రాజకీయాలను రుజువు చేసిన డీఎంకే: కడంబూర్ రాజు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఉదయనిధి స్టాలిన్‌ని ఉప ముఖ్యమంత్రిగా చేసి డీఎంకే వారసత్వ రాజకీయాలను రుజువు చేసిందని అన్నాడీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడంబూర్ రాజు పేర్కొన్నారు. కోవిల్పట్టిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ డీఎంకేని కాపాడలేకపోతున్నారని, పాలన కొనసాగించలేక ఉదయనిధిని ఉప ముఖ్యమంత్రిగా నియమించినట్లు తెలుస్తోందన్నారు. దీని ద్వారా డీఎంకేలో వారసత్వ రాజకీయాలు ఇంకా ఉన్నాయని రుజువైందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేస్తోందని ఎద్దేవా చేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని: విద్యుత్తుశాఖ చేపడుతున్న అత్యవసర మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అయ్యప్పన్‌తాంగల్, తరమణి, సేలైయూరు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గాంధీ జయంతి వేడుకలకు రాజ్‌భవన్ ఆహ్వానం

వడపళని, న్యూస్‌టుడే: అడయార్ గాంధీ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొనాలని పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రజలకు రాజ్‌భవన్ సోమవారం ఓ ప్రకటనలో ఆహ్వానం పలికింది. కార్యక్రమంలో గవర్నరు ఆర్ఎన్ రవి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, చెన్నై ఖాదీ గ్రామోద్యోగ భవన్, దిండిగల్లు గాంధీగ్రామ్ ట్రస్టులో తయారైన ఖాదీ ఉత్పత్తులు, ఆయుర్వేద మందుల ప్రదర్శన స్టాళ్లను గవర్నరు ప్రారంభిస్తారని తెలిపింది. అంతేకాకుండా తెన్‌కాశి అవ్వయి ఆశ్రమం, తెన్‌కాశి అమర్ సేవా సంఘంలో తయారైన వస్తువులు కూడా ప్రదర్శనలో ఉంచుతారని, ఖాదీ గ్రామోద్యోగ భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించే పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని వివరించింది. ఈ సందర్భంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

మంత్రి నాజర్‌కు శుభాకాంక్షలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా నాజర్ నియమితులైన సందర్భంగా డీఎంకే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మూర్తి ఆవడిలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి మిఠాయిలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సర్వసభ్య సభ్యుడు గుణశేఖర్ వెంట ఉన్నారు.


నాజర్‌కు మిఠాయిలు అందజేస్తున్న మూర్తి

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో
6 బంగారు పతకాలు
సత్తా చాటిన తిరుచ్చి విద్యార్థినులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో కేంద్రీయ విద్యాలయ పాఠశాలలకు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు 22 నుంచి 26 వరకు జరిగాయి. దేశవ్యాప్తంగా 200మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. తిరుచ్చి కావేరి స్పోర్ట్స్ క్లబ్ నుంచి కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో చదువుతున్న భవతారణి 17ఏళ్ల లోపు విభాగంలో 800, 1500, 100 మీటర్ల అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు గెలుచుకుంది. 14ఏళ్ల లోపు విభాగంలో 200, 300, 400 మీటర్ల పోటీల్లో కృతిక బంగారం పతకాలు అందుకుంది. మొత్తంగా ఆరు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. సోమవారం తిరుచ్చి రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన విద్యార్థినులకు బంధువులు, స్నేహితులు ఘనస్వాగతం పలికారు.


పతకాలతో కృతిక, భవతారణి

కళాశాలలో నాగుపాము కలకలం

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలూకా చెన్నై-తిరుపతి జాతీయ రహదారిపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ప్రభుత్వ కళాశాలలో 2 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలోని రసాయనశాస్త్ర ప్రయోగశాలలోకి సోమవారం ఆరు అడుగుల పొడవున్న నాగుపాము దూరింది. దాన్ని చూసిన విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పామును పట్టుకుని సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు.


పాముతో అగ్నిమాపక సిబ్బంది


సమావేశంలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

వస్త్రాల పంపిణీ పథకంపై సమీక్ష

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై సచివాలయంలో గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ముత్తుసామి, తమిళాభివృద్ధి, సమాచారశాఖ మంత్రి సామినాథన్, చేనేతశాఖ మంత్రి గాంధీ నేతృత్వంలో సోమవారం వచ్చే ఏడాదికి చీర, దోవతుల పంపిణీ పథకంపై సమీక్ష జరిగింది. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ధర్మేంద్ర ప్రతాప్ యాదవ్, చేనేత శాఖ సంచాలకుడు షణ్ముగసుందరం, కో-ఆప్‌టెక్స్ ఎండీ దీపక్ జాకబ్, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, శాఖాధికారులు పాల్గొన్నారు.

దిల్లీ - చెన్నై - దిల్లీ విమానం రద్దు

వడపళని, న్యూస్‌టుడే: దిల్లీ నుంచి చెన్నై, చెన్నై నుంచి దిల్లీ వెళ్లాల్సిన రెండు విమానాలు సోమవారం రద్దయ్యాయి. విస్తారా ఎయిర్‌లైన్స్ విమానంలో దిల్లీలో ఉదయం 7.50కు బయలుదేరి చెన్నైకి 10.45కు రావాల్సిన విమానం, తిరిగి చెన్నైలో 11.25కు బయలుదేరి దిల్లీ వెళ్లాల్సిన విమానం తక్కువ సంఖ్యలో ప్రయాణికులు ఉండటంతో రద్దు చేసినట్టు సంస్థ పేర్కొంది. ఈ విమానాల్లో టిక్కెట్లు బుక్ చేసుకున్న వారు వేరే విమానంలో ప్రయాణించే వెసులుబాటు కల్పించారు.

కపాలీశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాలు 3 నుంచి

వేళచ్చేరి: చెన్నై మైలాపూర్ కపాలీశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 2 నుంచి 12వ తేదీ వరకు మెగా బొమ్మల కొలువుతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ఆలయ కల్యాణ మండపంలో 10 రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ క్రమంలో ప్రతిరోజు సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు, సంగీత కచేరిలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, మొదటి రోజు సినీగాయిని మాలతి, ముఖేష్ బృందం సంగీత కచేరితో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వాతావరణ సమస్యలకు పరిష్కారం చూపేలా, పర్యావరణంపై అవగాహన కల్పించేలా భరతనాట్య ప్రదర్శన శ్రీకృష్ణ గానసభలో ఆదివారం జరిగింది. ప్రముఖ కళాకారిణి తాన్య సక్సేనా దర్శకత్వం వహించిన ప్రదర్శనలో ప్రకృతితో మానవాళి ఎప్పటికప్పుడు పెరుగుతున్న గొప్ప సంబంధాన్ని అన్వేషించే భావోద్వేగాలను వ్యక్తీకరించేలా నాట్యం ప్రదర్శించారు. ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.


నాట్య ప్రదర్శనలో కళాకారిణులు

చెన్నైలో 'తిరునంగై రాణి 2024' పోటీలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బార్న్ టూ విన్ సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ తరఫున హిజ్రాలకు ప్రత్యేకంగా దక్షిణ ఇండియా 'తిరునంగై రాణి 2024' అందాల పోటీలు 3న చెన్నై ఎగ్మూర్ మ్యూజిక్ థియేటర్‌లో సాయంత్రం జరగనున్నాయి. చెన్నై, ఈరోడ్, మదురై, నామక్కల్, కాంచీపురం, ఈరోడ్, సేలం, తంజావూర్, నెల్లై, తిరువణ్ణామలై, కోవై, తిరుచ్చి, దిల్లీ తదితర నగరాల నుంచి 14 మంది పాల్గొననున్నారు. కార్యక్రమ నిర్వాహకులు సోమవారం చెన్నై ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. హిజ్రా రాగిణి మాట్లాడుతూ.. హిజ్రాలు అంటే చాలామందికి చిన్నచూపుగా ఉందని దానిని మార్చేలా బార్న్‌టూ విన్ సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ పలు సహాయాలు చేస్తోందన్నారు. పోటీలు 2015 నుంచి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


విజేత జట్టు

మురుగప్పా హాకీ టోర్నీ విజేత భారత రైల్వే జట్టు

సైదాపేట, న్యూస్‌టుడే: 'మురుగప్పా' హాకీ టోర్నమెంట్‌లో రైల్వేస్ జట్టు విజయం సాధించింది. అఖిల భారత ఎంసీసీ మురుగప్పా గోల్డ్ కప్ హాకీ టోర్నమెంట్ చెన్నై ఎగ్మూర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో జరిగింది. ఆదివారం తుది పోటీ నిర్వహించగా భారత రైల్వే, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జట్లు తలపడ్డాయి. 5- 2 పాయింట్ల తేడాతో భారత రైల్వే జట్టు విజయం సాధించి రెండోసారి కప్ కైవసం చేసుకుంది.

ఈడీ కార్యాలయంలో సంతకం చేసిన సెంథిల్ బాలాజీ

ప్యారిస్, న్యూస్‌టుడే: మంత్రి సెంథిల్ బాలాజీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) కార్యాలయంలో హాజరై సంతకం చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన మంత్రి సెంథిల్ బాలాజీకి 471 రోజుల తర్వాత సుప్రీంకోర్టు సెప్టెంబరు 26న షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. వారానికి రెండుసార్లు ఈడీ కార్యాలయంలో హాజరై సంతకం చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత నుంగంబాక్కంలోని ఈడీ కార్యాలయంలో సంతకం చేశారు. సోమవారం రెండోసారి సంతకం చేశారు. రాష్ట్ర మంత్రిగా తిరిగి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఈడీ కార్యాలయానికి ప్రభుత్వ వాహనంలో కాకుండా ఆయన సొంత కారులో వచ్చారు.

రేపు వేట్టైయన్ ట్రైలర్ విడుదల



సైదాపేట, న్యూస్‌టుడే: సూపర్ స్టార్ రజనీకాంత్, జ్ఞానవేల్ రాజా కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'వేట్టైయన్'. అక్టోబర్ 10న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ఆడియో రిలీజ్ వేడుక ఇటీవల జరిగింది. ముందుగా సినిమాలో నటించిన నటీనటుల పాత్రలను పరిచయం చేస్తూ పలు వీడియోలను చిత్రబృందం విడుదల చేసింది. ఆ మేరకు రజనీకాంత్, అమితాబ్ బచ్చన్, తుషారా విజయన్, రిత్తికా సింగ్, రాణా తదితరుల పాత్రల గురించి వీడియోలు ఇదివరకే విడులయ్యాయి. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం సమకూర్చారు. ఈ సినిమా టీజర్ కూడా ఇటీవల విడుదలైంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 2న సినిమా ట్రైలర్ విడుదల కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.


విడాకులు తీసుకోవడం ఇష్టం లేదు: ఆర్తి


జయం రవి, ఆర్తి

సైదాపేట, న్యూస్‌టుడే: విడాకులు తీసుకోవడం తనకు ఇష్టం లేదని ప్రముఖ సినీ నటుడు జయం రవి భార్య ఆర్తి తెలిపారు. అభిప్రాయ బేధాలతో విడిపోతున్నట్లు ఇటీవల జయం రవి ప్రకటించిన సంగతి తెలిసిందే. కోర్టులో విడాకుల కోసం కేసు కూడా వేశారు. దీనిపై ఆర్తి ఇదివరకు మాట్లాడుతూ.. 'ఇది తనకు తెలియకుండా, తన అంగీకారం లేకుండా జయం రవి సొంతంగా తీసుకున్న నిర్ణయమని చెప్పారు. తర్వాత జయం రవి.. గాయని కెనిషాతో రిలేషన్‌షిప్‌లో ఉన్నందునే ఆర్తి నుంచి విడిపోవాలనుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని జయం రవి ఖండించారు. ఈ నేపథ్యంలో విడాకుల గురించి ఆర్తి ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో.. విడాకులు తీసుకోవడం తనకు ఇష్టం లేదని, జయం రవితో మాట్లాడేందుకు తాను సిద్ధమని తెలిపారు. ఇన్ని రోజులు తాను మౌనంగా ఉండటాన్ని తన బలహీనతగా భావించొద్దని చెప్పారు. వివాహ పవిత్రతను తాను గౌరవిస్తానన్నారు. తన దృష్టంతా కుటుంబ సంక్షేమంపైనే ఉందని పేర్కొన్నారు.

సమస్య ఏదైనా వేదనతో కుంగిపోకూడదు

సెల్వరాఘవన్



సైదాపేట, న్యూస్‌టుడే: ప్రముఖ దర్శకనటుడు ధనుష్ సోదరుడు సెల్వరాఘవన్ ఎప్పుడూ సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటారు. తరచూ తనకు తోచిన అభిప్రాయాలు, సలహాలు, ఆలోచనలను ట్వీట్ చేస్తుంటారు. కొన్ని వారాల క్రితం పాఠశాలలో వివాదాస్పద ప్రసంగం చేసిన మహావిష్ణుపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం తన 'ఎక్స్' పేజీలో.. ప్రేమ ఓటమి, కుటుంబ సమస్యలు, పనిఒత్తిడి తదితర ఏ కారణం చేతనైనా వేదనతో పడుకోవద్దని, అలా చేస్తే ప్రపంచం మిమ్మల్ని తొక్కేసి పోతూ ఉంటుందని పేర్కొన్నారు. కావున చెప్పులు వేసుకుని మీ బాధ్యతను నెరవేర్చేందుకు కదిలి వెళ్లాలని హితవుపలికారు.


లింక్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

పూండి నుంచి చెంబరంబాక్కానికి నీటి విడుదల

ఉత్తుకోట, న్యూస్‌టుడే: చెన్నై నగర తాగునీటి అవసరాలు తీర్చే పూండి చెరువు ఎత్తు 35 అడుగులు కాగా 3.231 టీఎంసీల నీటిని నిల్వచేయవచ్చు. చెరువులో వర్షపు నీరు, తెలుగుగంగ పథకం కింద కండలేరు జలాశయం నుంచి వచ్చే నీటిని నిల్వచేసి అవసరాల మేరకు పుళ్, చెంబరంబాక్కం చెరువులకు లింక్ కాలువ ద్వారా విడుదల చేస్తారు. తెలుగుగంగ పథకం కింద ఈనెల 22 నుంచి కండలేరు జలాశయం నీరు వస్తోంది. తొలుత వంద క్యూసెక్కులుగా చేరుకున్న నీరు సోమవారం 330 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో పూండి చెరువులో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. దీంతో పూండి నుంచి చెంబరంబాక్కం చెరువుకు లింక్ కాలువ ద్వారా సోమవారం 150 క్యూసెక్కుల నీటిని వదిలారు.

ఇస్లామిక్ సంస్థల అభిప్రాయాలను గౌరవించాలి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై ఇస్లామిక్ సంస్థల అభిప్రాయాలను గౌరవించాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. . ఇస్లాం మత సంక్షేమం, ధార్మిక ప్రయోజనాల కోసం దానంగా ఇచ్చిన ఆస్తులను నిర్వహించే వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి అన్ని తరఫుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పలు ఇస్లామిక్ సంస్థల అభిప్రాయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇస్లామిక్ సంస్థల అభిప్రాయాలను గౌరవించాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా సవరణలు చేసి బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు.


తిరువణ్ణామలై: మహానందికి చందనాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం


తిరువణ్ణామలై: బంగారు వృషభ వాహనంపై ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి

వైభవంగా ప్రదోషోత్సవం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రదోషోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవర్లకు, మహానంది సహా అన్ని నంది విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. ఉత్సవమూర్తులైన ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి బంగారు వృషభ వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పళ్లిపట్టు: పళ్లిపట్టులోని పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రదోషోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మూలవర్లకు, నంది విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పళ్లిపట్టు: పార్వతి సమేత సంగమేశ్వరస్వామి


రెడ్‌హిల్స్: ఉదయనిధి అక్షరాల ప్లకార్డులతో కార్యకర్తలు

డీఎంకే శ్రేణుల సంబరాలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రిగా ఉదయనిధి నియమితులైన నేపథ్యంలో డీఎంకే శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. రెడ్‌హిల్స్ సమీప వడకరైలో యూనియన్ డీఎంకే కార్యదర్శి శరవణన్ సోమవారం మిఠాయిలు పంచి బాణసంచా పేల్చి సంబరాలు జరిపారు. పెరియపాళ్యం సమీప తీర్థకరియంపట్టులో కార్యకర్తలు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేరుతో ప్లకార్డులను ప్రదర్శించి అన్నదానం చేశారు. ఊత్తుకోట, పొన్నేరి, గుమ్మిడిపూండిలో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. **శోళింగర్:** రాణిపేట జిల్లా శోళింగర్ మధ్య యూనియన్ డీఎంకే తరఫున స్థానిక బాణావరం కూడలి వద్ద వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి డీఎంకే యూనియన్ కార్యదర్శి పూర్ణచందర్ అధ్యక్షత వహించి మిఠాయిలు పంచిపెట్టారు. జిల్లా పంచాయతీ కమిటీ ఉపాధ్యక్షులు నాగరాజు, న్యాయవాది ఉదయకుమార్, మేల్‌వెంకటాపురం పంచాయతీ అధ్యక్షుడు జగదీశన్ తదితరులు పాల్గొన్నారు.


శోళింగర్: మిఠాయిలు పంచిపెడుతున్న యూనియన్ కార్యదర్శి పూర్ణచందర్


పరీక్షలు చేస్తున్న వైద్యులు

శుభ్రతా కార్మికులకు వైద్య శిబిరం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రెడ్‌హిల్స్ సమీప పుళల్‌లో స్వచ్ఛ భారత్ పథకం కింద శుభ్రతా కార్మికులకు వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. యూనియన్ ఛైర్మన్ భారతి అధ్యక్షత వహించారు. 21 మందితో కూడిన వైద్య బృందం 75 మంది కార్మికులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసింది. బీడీవోలు చిత్రా ఫెర్నాండెజ్, విజయ, వైద్యశాఖ అధికారి మధుమతి పాల్గొన్నారు.

హొగినేకల్‌కు పెరిగిన నీటిరాక

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కావేరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాల కారణంగా హొగినేకల్‌కు నీటిరాక పెరిగింది. ఆదివారం రాత్రి 7 వేల ఘనపుటడుగుల నీరు చేరగా సోమవారం వేకువజామున 9 వేల ఘనపుటడుగులకు చేరింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో 13 వేల ఘనపుటడుగులకు పెరిగింది. పిలిగుండ్లు ప్రాంతంలో హొగినేకల్‌కు వస్తున్న నీటిని కేంద్ర జలవనరుల శాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు.


జలపాతం వద్ద దూసుకొస్తున్న నీరు

ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తే కఠినచర్యలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: పూందమల్లిలోని అరిజ్ఞర్ అన్నా ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల విద్యార్థులు కొందరు కొన్ని రోజుల క్రితం బస్సు పైకెక్కి రీల్స్ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. అంతేకాకుండా రాళ్లు రువ్వడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో పోలీసుశాఖ తరఫున అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సీఐ లారెన్స్ పాల్గొని మాట్లాడుతూ... విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, రీల్స్ వేయడం, సాహసాలు చేయడం మానుకోవాలని, బస్సుల్లో ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తే టీసీ ఇవ్వడమే కాకుండా మరే ఇతర పాఠశాల్లో చేరకుండా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

2న గ్రామ సభలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2న గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే సభల్లో బీడీవో కార్యాలయ అధికారులు పాల్గొంటారని, పంచాయతీ ఆదాయ, వ్యయ ఖర్చులు వివరించాలని, జల్‌జీవన్ పథకంపై అవగాహన కల్పించాలని, కొత్త దివ్యాంగుల జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.


అక్రమ నిర్మాణాలు కూలుస్తున్న దృశ్యం

ఆక్రమణల తొలగింపు

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ తోటపాళ్యం వినాయక ఆలయ వీధిలో జలవనరులశాఖకు చెందిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్నారు. వాటిని తొలగించాలని కోర్టు ఆదేశించింది. ఆ మేరకు ఆక్రమణదారులకు సదరుశాఖ అధికారులు 3 నెలల క్రితం నోటీసులు జారీ చేశారు. అయినా తొలగించకపోవడంతో సోమవారం తహసీల్దాల్ మురళీధరన్ సమక్షంలో అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ నిర్మాణాలను కూల్చేశారు.

మరమరాల తయారీ ముమ్మరం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఆయుధపూజలో మరమరాలు ఎక్కువగా వినియోగిస్తుంటారు. పండుగ సమీపిస్తున్న నేపథ్యంతో నామక్కల్, సేలం, ధర్మపురి, కరూర్ తదితర జిల్లాలో పాత పద్ధతిలో మరమరాలు ముమ్మరంగా తయారు చేస్తున్నారు. కర్ణాటక, పశ్చిమబెంగాల్ నుంచి 64 రకం వడ్లను తెప్పించి బియ్యం తయారు చేసి స్వల్పంగా ఉప్పు చేర్చి ఎండబెట్టి చక్కెర, సోడా చేర్చి 'ఒరుప్పు' మరమరాలు సిద్ధం చేస్తున్నారు. ఎర్ర బియ్యంతోనూ తయారు చేస్తున్నారు. తవుట్టుపాలయం సమీపంలోని సుల్తాన్‌పేటలో కొయ్యలకు మంటపెట్టి మరమరాలు తయారు చేస్తున్నారు.


మరమరాల బస్తాలు

సహనం పరీక్షించొద్దు: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: తమ సహనాన్ని పరీక్షించొద్దని, ఆర్ఎస్ఎస్ ఊరేగింపు వ్యవహారమై పోలీసులను మద్రాసు హైకోర్టు హెచ్చరించింది. విజయదశమి సందర్భంగా అక్టోబరు 6న రాష్ట్ర వ్యాప్తంగా 58 చోట్ల ఊరేగింపునకు అనుమతివ్వాలని ఆర్ఎస్ఎస్ తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు జస్టిస్ జయచంద్రన్ ఎదుట సోమవారం విచారణకు వచ్చాయి. అప్పుడు ప్రభుత్వం తరఫున.. 58 చోట్ల అనుమతి కోరగా 42 చోట్ల ఇచ్చినట్లు, ఒకే జిల్లాలో ఒకటికి మించిన ప్రాంతాల్లో కోరడంతో భద్రతా కారణాలతో ఇవ్వలేదని తెలిపారు. అనంతరం ఆర్ఎస్ఎస్ తరఫున.. చిన్న చిన్న కారణాలు చూపి పలు ప్రాంతాల్లో అనుమతివ్వలేదని, ఇచ్చిన చోట్ల పలు కొత్త ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. పిటిషన్లు విచారించిన న్యాయమూర్తి. . ఆర్ఎస్ఎస్ ఊరేగింపునకు సుప్రీంకోర్టు, హైకోర్టు ఇది వరికే నిబంధనలు రూపొందించిన స్థితిలో ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. ఒకే జిల్లాలో ఒకటికి పైగా ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించడానికి అనుమతివ్వడం కుదరదని భద్రతా కారణాలు చెప్పే పోలీసులు డీఎంకే వజ్రోత్సవాలకు మాత్రమే ఒకేరోజు పలుచోట్ల భద్రతా ఎలా కల్పించారని ప్రశ్నించారు.

దొంగల దాడిలో గాయపడిన పోలీసులకు పరామర్శ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం త్రిశూర్‌లోని ఏటీఎంలలో చోరీ చేసి కంటైనర్ లారీలో పరారవుతున్న ఉత్తరాది రాష్ట్రానికి చెందిన ఐదుగురు నిందితులను రెండు రోజులక్రితం నామక్కల్ పోలీసులు వెంబడించారు. ఈ క్రమంలో కంటైనర్‌లో ఉన్న చోరులు తుపాకీతో పోలీసులపై కాల్పులు జరుపగా కొందరు గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నామక్కల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమారపాయం ఇన్‌స్పెక్టర్ దవమణి, మల్లసముద్రం ఎస్సై రంజిత్‌ని సౌత్ జోన్ ఐజీ సెంథిల్‌కుమార్, డీఐజీ ఉమా ఆదివారం పరామర్శించారు.


ఇన్‌స్పెక్టర్ రంజిత్‌ని పరామర్శిస్తున్న ఐజీ సెంథిల్‌కుమార్

బావిలో పడి ఇద్దరు బాలురి మృతి

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా వానాపురం సమీప వళువంపట్టు గ్రామానికి చెందిన అయ్యప్పన్, భారతి దంపతుల కుమారుడు రోహిత్ (7), అదే ప్రాంతానికి చెందిన కుబేంద్రన్-మేనక దంపతుల కుమారుడు తరుణ్ (7) 2వ తరగతి చదువుతున్నారు. పాఠశాలకు సెలవు కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఎంతసేపయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. వ్యవసాయ బావిలో విగతజీవులుగా తేలుతుండటాన్ని గుర్తించారు. పోలీసులు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి జారిపడి ప్రైవేట్ ఉపాధ్యాయిని...


జయలక్ష్మి (పాతచిత్రం)

విల్లివాక్కం: నీలగిరి జిల్లా కున్నూర్, పరిసర ప్రాంతాలలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం వరకు కొనసాగింది. కున్నూర్ మౌంట్‌రోడ్డు కృష్ణాపురానికి చెందిన వడ్రంగి రవి భార్య జయలక్ష్మి కున్నూర్ ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయిని. ఆదివారం రాత్రి భర్త పిల్లలతో కలిసి నిద్రిస్తున్నారు. భారీ వర్షానికి తలుపు రంధ్రంలో నుంచి నీరు లోపలికి చొరబడింది. జయలక్ష్మి(35) లేచి తలుపు తీయగా మట్టిదిబ్బ జారి పడింది. ఆమె మట్టిలో చిక్కుకుంది. అరుపులు విని రవి వచ్చి చూడగా జయలక్ష్మి మట్టిలో కూరుకుపోవడం చూసి నిశ్చేష్టుడయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కార్మికుడు...

రెడ్‌హిల్స్: తిరువళ్ళూరు సమీప కుప్పమ్మాఛత్రానికి చెందిన భాస్కర్ పాత ఇనుము దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతను దుకాణాన్ని శుభ్రం చేసేందుకు విడయూరుకు చెందిన సెంద్రాయన్ (38) అనే కార్మికుడిని నియమించాడు. ఇతను సోమవారం దుకాణ పైకప్పును శుభ్రం చేస్తుండగా పైన వేలాడుతున్న విద్యుత్తు తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తిరువళ్ళూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏనుగు దాడిలో భవన నిర్మాణ కార్మికుడు...


చంద్రన్ (పాతచిత్రం)

కోయంబత్తూరు: కోవై నరసింగపురానికి చెందిన చంద్రన్ (50) భవన నిర్మాణ కార్మికుడు. ఇతను సోమవారం ఉదయం ఇంటి ఎదుట కూర్చుని ఉండగా ఓ ఏనుగు దాడి చేసింది. ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి బలవన్మరణం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్ళూరు సమీప పట్టాభిరాం తోట్టక్కార వీధికి చెందిన నసీరాభాను (19) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తోంది. ఈమె సరిగా కంపెనీకి వెళ్లకపోవడంతో అన్న అమృద్దీన్‌ఖాన్ మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాక్టర్‌తో తొక్కించి మహిళ హత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరువారూర్ జిల్లా నీడామంగళం సమీప సోనాంపేట్టై గ్రామానికి చెందిన శివాజీ, ఇందుమతి (45) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడున్నాడు. అదే గ్రామానికి చెందిన వడ్డీ వ్యాపారి గాంధీ వద్ద ఆరు నెలల క్రితం శివాజీ రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. అసలు, వడ్డీ తీర్చేశాడు. కానీ, గాంధీ అదనంగా వడ్డీ అడుగుతూ శివాజీ కుటుంబాన్ని బెదిరించసాగాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం శివాజీ ఇంటికి ట్రాక్టర్‌తో వెళ్లిన గాంధీ.. ఇంటి ముందు నిలిపి ఉన్న శివాజీ కారుని ఢీకొట్టాడు. శబ్దం విని బయటకు వచ్చిన ఇందుమతిని కూడా ట్రాక్టర్‌తో తొక్కించి వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

నానమ్మను చంపిన మనవడు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి జిల్లా సెంగాట్టుపట్టి గ్రామానికి చెందిన నాగలక్ష్మి (94).. కోడలు భానుమతి (70), మనవడు మురళీరాజా (43)తో కలిసి నివసిస్తుంది. మురళీరాజా పనికి వెళ్లకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఇతను 2016లో తన తండ్రి పద్మనాభన్‌ను చంపిన కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఖర్చులకు డబ్బులు కావాలని తల్లిని అడిగాడు. ఆమె లేదని చెప్పింది. ఈ క్రమంలో నాగలక్ష్మి మనవడిని మందలించింది. దీంతో ఆక్రోశానికి గురైన అతను ఇనుపరాడ్డుతో నాగలక్ష్మి తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

17ఏళ్ల బాలికపై ఇద్దరు యువకుల అత్యాచారం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూర్ జిల్లా రాజామఠం ప్రాంతంలో ఆదివారం రాత్రి 17ఏళ్ల బాలిక ఏడుస్తూ కనిపించడంతో స్థానికులు అదిరాంబట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పట్టుకోట్టై ఆల్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి దర్యాప్తు చేశారు. బాలిక తిరువారూర్ జిల్లా ముత్తుపేట్టై ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు. ఆమె తండ్రి మన్నార్‌కుడిలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకున్నాడని, ఇందుకు సంబంధించి ఆ కంపెనీలో పనిచేసే సాత్తనూర్‌కు చెందిన ముత్తుపాండియన్ (28) తరచూ బాలిక తండ్రికి ఫోన్ చేసి అప్పు తీర్చాలని బెదిరించేవాడని తెలిసింది. ఇదిలా ఉండగా ఆదివారం ముత్తుపాండియన్ ఫోన్ చేయగా బాలిక ఫోన్ తీసి.. తన తండ్రికి ఆరోగ్యం బాగాలేదని చెప్పింది. ఆ విషయం ఆఫీసుకు వచ్చి చెప్పాలని ముత్తుపాండియన్ చెప్పడంతో ఆమె ఒంటరిగా మన్నార్‌కుడికి వెళ్లింది. అక్కడ బాలికకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లిన ముత్తుపాండియన్.. తన స్నేహితుడు రాజాతో కలిసి అత్యాచారానికి పాల్పడి అక్కడే వదిలేసి వెళ్లిపోయారని తేలింది. దీంతో బాలికను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో అగ్నిప్రమాదం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్‌కోవిల్ - హనుమంతపురం రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న రామానుజన్ బ్లాక్‌లో జిల్లాలోని పాఠశాలలకు పంపిణీ చేయడానికి పాఠ్య పుస్తకాల గోదాము ఉంది. ఇందులో 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించిన 10 టన్నుల పాత పాఠ్య పుస్తకాలను నిల్వ ఉంచారు. ఆదివారం సాయంత్రం గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సగం పాఠ్య పుస్తకాలు కాలిపోయాయి. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.


కాలిపోయిన పాత పాఠ్య పుస్తకాలు

పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: అంబత్తూరు పోలీసులు కళ్లికుప్పం సర్వీస్ రోడ్డులో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. వారిని చూసిన ఓ వ్యక్తి అక్కడున్న ముళ్ల పొదల్లో దాక్కున్నాడు. పోలీసులు అతన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. ముళ్ల పొదల్లో దాచిన 500 కిలోల పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రెడ్‌హిల్స్‌కు చెందిన కన్నన్‌గా గుర్తించి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

సాంకేతిక సమస్యతో ఆగిన పల్లవన్ ఎక్స్‌ప్రెస్

ప్యారిస్, న్యూస్‌టుడే: కారైక్కుడి నుంచి చెన్నైకి సోమవారం తెల్లవారుజామున పల్లవన్ ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరింది. చెట్టినాడు ప్రాంతంలో వెళ్తుండగా చివరి బోగీ ముందున్న బోగి బ్రేక్ బైండింగ్ పాడై పొగ రావడంతో రైలుని ఆపేశారు. అనంతరం ఇంజినీర్లు సరిచేయడంతో 55 నిమిషాలు ఆలస్యంగా రైలు బయలుదేరింది.

ఇళ్ల పట్టాలు కోరుతూ ఆందోళన

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లాలో పేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వండలూర్ తాలూకా కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) కార్యకర్తలు, నిర్వాహకులు సోమవారం ఆందోళన చేపట్టారు. పలు డిమాండ్లతో 1వ తేదీ తాంబరం తాలూకా కార్యాలయం ఎదుట, 3న చెంగల్పట్టు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆడపిల్లల అదృశ్యంపై వివరాలు సమర్పించండి: హైకోర్టు

ఈనాడు-చెన్నై: ఇషా ఫౌండేషన్‌పై నమోదైన కేసులపై విచారణ జరుపుతున్న హైకోర్టు డివిజన్ బెంచి.. కేసు వివరాల్ని సమగ్రంగా సమర్పించాలని మధ్యంతర ఉత్తర్వుల ద్వారా కోయంబత్తూరు పోలీసుల్ని ఆదేశించింది. వ్యవసాయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.కామరాజ్ వేసిన హెబియస్‌కార్పస్ పిటిషన్‌పై కోర్టు స్పందించింది. ఇషా ఫౌండేషన్‌లో తమ ఇద్దరు కుమార్తెలు బందీలుగా ఉన్నారని, వారిని తమకు అప్పగించాలని కోరుతూ పిటిషనర్ కోర్టును ఆశ్రయించారు. విచారణను అక్టోబరు 4కు వాయిదా వేశారు.